సాక్షి ప్రకాశం

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



తేట తెలుగు.. భావితరాలకు వెలుగు

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాష గొప్పతనంపై ప్రత్యేక కథనం... - 8లో..



గురుకులంలో దారుణం

టంగుటూరులోని గురుకుల పాఠశాలలో విద్యార్థులతో వంట పనులు చేయిస్తుండటంతో ఓ విద్యార్థిపై వేడిగా ఉన్న పాలు పడి తీవ్రగాయాలయ్యాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం 32/23

వాతావరణం

ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది.
ఆకాశం నిర్మలంగా ఉంటుంది.
పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీల్లో జిల్లా నాయకుల నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులు పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర మహిళా విభాగం సెక్రటరీగా మేడికొండ జయంతి, రైతు విభాగం సెక్రటరీగా సూరసాని మోహన్‌రెడ్డి, రైతు విభాగం జాయింట్ సెక్రటరీలుగా ఏలం మురళీకృష్ణ, తాటికొండ రామచంద్రరావును నియమించారు. అలాగే, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీలుగా సారే వెంకటనాయుడు, ఎన్నాబత్తిన వెంకటేశ్వరరావును నియమించారు. రాష్ట్ర బూత్ కమిటీ జనరల్ సెక్రటరీగా బొర్రా కృష్ణారెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీలుగా సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వెగినాటి ఓసురారెడ్డిని నియమించారు.

ఆర్యవైశ్యులు భిక్షగాళ్లు కాదు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: ఆర్యవైశ్యుల్లో నిరుపేదలు ఉంటారుగానీ భిక్షగాళ్లు ఉండరని అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరకం నాగాంజనేయులు అన్నారు. ఆర్యవైశ్యులు కష్టపడి సంపాదించుకుని తమకు వచ్చిన దాంట్లోనే ఇతరులకు సాయం చేస్తుంటారని, ఆత్మగౌరవంతో బతుకుతారని అన్నారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించిన మెసేజ్‌ను అందరితో పాటు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పీఏ అనిల్‌కు పెట్టినందుకు తనను భిక్షం అడుక్కునే కొ..క అంటూ ఫోన్ చేసి దూషించారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఒక వీడియో విడుదల చేసిన ఆయన.. జరిగిన విషయాలను వివరించారు. 2014లో టీడీపీ విజయం కోసం తాను కృషి చేశానని, ఆ క్రమంలో తాను రూ.8 లక్షలు నష్టపోయానని చెప్పారు. అయినప్పటికీ బాధ పడలేదని, పొట్టి శ్రీరాములు గుడి నిర్మాణానికి విరాళం అడిగితే ఇంటి చుట్టూ తిప్పుకున్న అప్పటి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తన వద్ద డబ్బులు లేవని చెప్పారని.. అవహేళనగా మాట్లాడి తనను అవమానించారని వివరించారు. ఇప్పుడు పొట్టి శ్రీరాములు వీడియో పంపితే ఎమ్మెల్యే పీఏ అనిల్ తనను ముష్టివాడని దూషిస్తూ ఫోన్ చేశారన్నారు. ఇంటికొచ్చి కొడతానంటూ బెదిరించాడని తెలిపారు. ఎమ్మెల్యే దామచర్లకు ఆర్యవైశ్యులపై ఏమాత్రం గౌరవం ఉన్నా తన పీఏను మందలించాలని కోరారు. లేకపోతే అతడు ఆర్యవైశ్యుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తూనే ఉంటాడని చెప్పారు. పొట్టి శ్రీరాములు విగ్రహం కోసం రూపాయిచ్చే గతి లేకపోయినా కనీసం ఆ మహనీయుడిని గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఆర్యవైశ్యుల ఓట్లు లేకుండా టీడీపీ గెలుపు సాధ్యమయ్యేదా అని ప్రశ్నించారు. ఆర్యవైశ్యులు తలచుకుంటే పరిస్థితులు మారిపోతాయని హెచ్చరించారు.

సోషల్ మీడియాపై నిరంతర నిఘా

● ఎస్పీ ఏఆర్ దామోదర్



ఒంగోలు టౌన్: సోషల్ మీడియాపై నిరంతర నిఘా ఉందని, తప్పుడు సందేశాలు, విద్వేషాలు రెచ్చగొట్టే మెసేజ్‌లు పెట్టే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్, ఫేస్ బుక్, ఇన్‌స్టా గ్రాం, టెలిగ్రాం, యూ ట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఇతరులను కించపరిచేలా, అసభ్యకరమైన, అనైతిక పోస్టులు పెడితే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా, కులాల మధ్య, మతాల మధ్య, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు రగల్చడం, సున్నితమైన మతవిశ్వాసాలపై వదంతులు, అవాస్తవాలు ప్రచారం చేయడం నేరమన్నారు. ప్రజలను పక్కదారి పట్టించే విధంగా ఫేక్ న్యూస్‌లు పెట్టిన, ఫార్వార్డ్ చేసిన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నాడు...

2020 నుంచి 2024 వరకూ రైతులకు ఎర్రబంగారంగా మిర్చి పంట నిలిచింది. వైఎస్సార్ సీపీ హయాంలో ధరల స్థిరీకరణ నిధిని పెట్టింది. ఏ పంటకు గిట్టుబాట ధర లేకుంటే ఆ పంటకు ధర పెంచి వ్యవసాయాన్ని పండుగలా మార్చారు నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి సకాలంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించి తెగుళ్లు వస్తే శాస్త్రవేత్తలతో సమావేశాలు నిర్వహించి నివారణ చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు ధరల వివరాలను రైతులకు తెలిపారు. దీంతో సాగుచేసిన రైతుల పాలిట ఎర్రబంగారంగా మిర్చి పంట మారింది. గతేడాది వరకూ క్వింటా ధర రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకూ పలికింది. తేజ, బాడిగ రకాలకు అదనంగా మరో రూ.2 వేలు వచ్చింది.

నేడు...

జిల్లాలో మిర్చి సాగుచేసిన రైతులు కళ్లనీళ్లు పెట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం మిర్చిరైతుకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమైంది. మిర్చి సాగు చేసిన రైతు కంట్లో కారం పడుతోంది. గిట్టుబాటు ధర లేక విలవిల్లాడిపోతున్నారు. గుంటూరు యార్డులోనే క్వింటా ధర రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.12 వేల మధ్య కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు సాగుచేసిన మిర్చికి మంచి ధర వచ్చేంత వరకు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచుకుంటున్నారు. ఎకరా మిర్చి సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకు రైతులు ఖర్చు పెట్టారు. అయితే అక్టోబర్, నవంబర్‌లో మిర్చికి వైరస్ తెగులు సోకడంతో ఊహించని విధంగా పంట దిగుబడి తగ్గిపోయింది. ఇదే సమయంలో నవంబర్‌లో క్వింటా రూ.18 వేలు ఉండగా డిసెంబరు నాటికి రూ.14 వేలకు తగ్గింది. నేడు రూ.10 వేలకు కూడా కొనడం కష్టమైంది. మిర్చి ఎందుకు సాగుచేశామా అని రైతులు దిగులుపడుతున్నారు. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయలేదు. పశ్చిమ ప్రకాశంలో గుంటూరు యార్డుకు పోలేని రైతులు దళారులు చెప్పిన ధరకే విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. లేకుంటే ముగ్గురు నలుగురు రైతులు కలిసి సుమారు రూ.20 వేలకు బాడుగ పెట్టుకుని లారీల్లో వేసుకుని గుంటూరు వెళ్లి రెండుమూడు రోజులు యార్డులోనే తిండీతిప్పలు మానేసి వచ్చిన ధరకే విక్రయించి ఉసూరుమంటూ తిరిగి వస్తున్నారు.

- కూటమి ప్రభుత్వంలో మిర్చి రైతు కంట్లో కారం
- పెట్టిన పెట్టుబడి కూడా రావడం కష్టమే
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా రూ.22 వేలు
- ప్రస్తుతం గుంటూరులో క్వింటా ధర రూ.10 వేలు మాత్రమే
- జిల్లాలో 59,005 ఎకరాల్లో మిర్చి సాగు

ధర / రైతు ఉసూరు



జిల్లాలో మూడేళ్లుగా లాభాలు చవిచూసిన మిర్చి రైతు నేడు గడ్డు పరిస్థితి ఎదుర్కొంటున్నాడు. పంట చేతికొచ్చిన సమయంలో కనీస మద్దతు ధర రాక విలవిల్లాడుతున్నాడు. కూటమి ప్రభుత్వం నుంచి కనీస మద్దతు సైతం లభించకపోవడం, తెగుళ్ల ఆశించడం, కూలి రేటు భారీగా పెరగడంతో పాటు గుంటూరు మార్కెట్ యార్డులో ధరలు నేలచూపులు చూస్తుండడంతో మిర్చి రైతు కంట రక్త కన్నీరొస్తోంది. లక్షలు వెచ్చించి సాగుచేసిన రైతులు లబోదిబోమంటున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. ఇదే అదునుగా సిండికేట్లు నాణ్యతలేవంటూ ధరలు తగ్గించేసి దోచేస్తున్నారు. జిల్లాలో దయనీయంగా మారిన మిర్చి రైతు పరిస్థితిపై సాక్షి ఫోకస్...

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి తదితర నియోజకవర్గాల్లోని గ్రామాల్లో రైతులు అత్యధికంగా మిర్చి సాగుచేశారు. గతేడాది జిల్లాలో 66,387 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాల్సి ఉండగా, మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉండటంతో 96 వేల ఎకరాల్లో సాగు చేశారు. లాభాలు చవిచూశారు. గతేడాది గుంటూరు మార్కెట్ యార్డులో తేజ రకం అత్యధికంగా రూ.22 వేల నుంచి రూ.24 వేల మధ్య విక్రయాలు సాగాయి. ఫలితంగా రైతులు లాభాలు ఆర్జించారు. వచ్చే ఏడాది కూడా మంచి ధరలు వస్తాయని రైతులు ఎదురు చూశారు. పరిస్థితి తలకిందులైంది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా రైతులకు లాభాల సంగతి దేవుడెరుగు.. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతులు సాగు విస్తీర్ణాన్ని భారీగా తగ్గించేసుకున్నారు. సుమారు 59,005 ఎరాల్లో సాగు చేశారు. ఇప్పటికే 3 కోతలు పూర్తయ్యాయి. నవంబర్‌లో క్వింటా ధర రూ.17 వేల నుంచి రూ.18 వేలు ఉండగా, డిసెంబరు నాటికి రూ.14 వేలకు పడిపోయింది. జనవరిలో రూ.14 వేల నుంచి రూ.12 వేలకు చేరి తాజాగా రూ.10 వేలు కనిష్టానికి పడిపోయింది. ఇక మిర్చి కోతలకు కూలీలకు భారీగా చెల్లించాల్సి వస్తోంది. క్వింటా మిర్చి కోసేందుకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకూ ఖర్చు చెల్లిస్తున్నామని రైతులు తెలిపారు. ఇలా అయితే మిర్చి సాగు చేపట్టడం కష్టమని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు నిల్...

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజకవర్గాల్లో మిర్చిని అధిక విస్తీర్ణంలో సాగుచేశారు. అయితే ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు పండించిన మిర్చిని బస్తాల్లో పెట్టుకుని గుంటూరు వెళ్తున్నారు. దీంతో రానూ.. పోనూ లారీ బాడుగ కింద సుమారు రూ.20 వేల ఖర్చు వస్తుంది. మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నా ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి స్పందనా లేదు. ఎకరా మిర్చి సాగుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకూ ఖర్చుపెట్టారు. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడులు రావచ్చని రైతులు భావిస్తున్నారు. గుంటూరు మార్కెట్ యార్డులో తేజ, బాడిగ రకాల మిర్చిని ఎక్కువగా రైతులు తీసుకెళ్తున్నారు. ఈ రెండు రకాల ధరలు తగ్గిపోయాయి. తేజ టాప్ క్వాలిటీకి సుమారు రూ.12 వేల నుంచి 13 వేల వరకు ధర ఉన్నట్లు తెలుస్తోంది.

దిగుబడి లేదు.. ధర లేదు



ఐదు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. గత పదేళ్ల నుంచి ఎండు మిర్చి పండిస్తున్నా. ఇంత దారుణమైన పరిస్థితులు గతంలో ఎప్పుడూ లేవు. ఎర్ర నల్లి ఉధృతంగా రావడంతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. గత ఏడాది ఎకరాకు 20–25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నేడు 10–15 కింటాళ్లు కూడా రావడం లేదు. నల్లి నివారించేందుకు విపరీతంగా పురుగుమందులు వాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఎకరాకు ఖర్చు రూ.2 లక్షలు వచ్చింది. రెండు రోజుల క్రితం యార్డులో అమ్మితే క్వింటా రూ.12 వేలు ధర పడింది. గతేడాది రూ.20 వేల నుంచి రూ.22 వేల ధరకు అమ్మాను. తాలు కాయలు గతంలో రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఉంటే నేడు రూ.5 వేలు కూడా పడటంలేదు. తెగుళ్లతో ఇంకో కోత వచ్చే పరిస్థితి లేదు. ఐదు ఎకరాలకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు పెట్టాను. రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల నష్టం వస్తుంది. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు.

– కామిరెడ్డి వెంకట రంగారెడ్డి, వంగపాడు, బేస్తవారిపేట

ఎకరాకు రూ.లక్ష నష్టం



గత ఏడాది ఎకరా మిరప సాగు చేశా. 30 క్వింటాల దిగుబడి వచ్చింది. అన్ని ఖర్చులుపోగా రూ.3 లక్షల ఆదాయం మిగిలింది. ఈ ఏడాది రెండు ఎకరాల్లో పంట సాగు చేశా. మొదటి కోతగా 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇందులో 4 క్వింటాలు తాలు, 2 క్వింటాలు మంచి కాయలు వచ్చాయి. తాలు రూ.6500, మంచి కాయలకు రూ.12 వేల ధర పలికింది. రెండో కోతకు 6 క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదు. క్వింటా ఎండు మిర్చి కోతకు రూ.5 వేలు కోత కూలీలు, రూ.1000 గ్రేడింగ్, రూ.1000 గోతాలు, యార్డ్‌కు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు వస్తుంది. వర్షాలు అధికం కావడంతో కాయపై మచ్చలు ఏర్పడి లోపల బూజు రావడంతో బరువు తగ్గడంతో పాటు తాలు కాయలుగా మారాయి. తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంది. ఖర్చులు అధికమయ్యాయి. రెండు ఎకరాలకు రూ.2.50 లక్షల నష్టం వస్తుంది.

– లాకా కొండయ్య, వంగపాడు, బేస్తవారిపేట మండలం

ఇలా అయితే నష్టమే



నేను ఈ ఏడాది 10 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. పెట్టుబడి సుమారు రూ.18 లక్షల వరకు అయ్యింది. మిర్చి నారు, ఎరువులు, తెగుళ్లకు మందులు, అంతరసేద్యంలో కూలీలకే ఎక్కువ ఖర్చయింది. వైరస్ తెగులు సోకడంతో దిగుబడులు తగ్గాయి. గుంటూరు యార్డులో మిర్చి ధర తగ్గడంతో పెట్టుబడులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. గత రెండేళ్లుగా మిర్చికి మంచి ధర ఉండటంతో ఈ ఏడాది సాగుచేశా. అయితే ధరలు.. దిగుబడులు.. చూస్తే నష్టాలే వస్తున్నాయి. ఈ ప్రభుత్వం రైతుల గురించి పట్టించుకోకపోవడం బాధగా ఉంది.

– గుంటక సుబ్బారెడ్డి, మిర్చిరైతు, పాతపాడు, కొనకనమిట్ల మండలం

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు



7 ఎకరాల్లో మిర్చి సాగు చేశా. తొలి కాపుకింద 50 క్వింటాల దిగుబడి వచ్చింది. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రెండో కాపు ఆశాజనకంగా లేదు. ఈ ఏడాది క్వింటా రూ.10 వేలకు మించి పలకడం లేదు. గతేడాది ఈ రకం రూ.18 వేల పైచిలుకు పలికింది. పంట దిగుబడులు తగ్గినా మిర్చి రేటు గతంలోలా నిలకడగా ఉంటే నష్టం ఉండదు. ఏడాదంతా కష్టపడ్డా పెట్టుబడులూ వచ్చే పరిస్థితులు లేవు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– మూలా సుబ్బారెడ్డి, ఐనముక్కల, పెద్దదోర్నాల మండలం



మిర్చిని బస్తాల్లోకి ఎత్తుతున్న రైతు

ధరలు చూస్తే నీరసం వస్తుంది



రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. కోత కొద్దామన్నా కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. అసలు పంటలు కొనుగోలు చేసేందుకు దళారులు రావడం లేదు. గుంటూరు యార్డులో క్వింటా రూ.12,500 పలుకుతోంది. గత ఏడాది తాలు కాయలకే ఆ ధర పలికింది. మంచి మిర్చికి రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు ధర పలికింది. ఒక్కో కూలీకి రూ.500 లేదా కిలోకు కాయలు కోసినందుకు రూ.30 ఇవ్వాల్సి వస్తోంది. ఎకరా కోత ఖర్చులకే రూ.60 వేలు ఖర్చవుతోంది. ఎకరా సాగుకు రూ.1.20 లక్షలు పెట్టుబడి పెడితే రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి ప్రస్తుతం లేదు. పంటను చూస్తే నీరసం వస్తుంది. ఐదు నెలల పాటు నేను, నా భార్య ఎంతో కష్టపడి పండించిన పంటను వదులుకోలేక నష్టం వచ్చినా సరే కోత కోపించాల్సిందేనని కూలీల కోసం ఎదురుచూస్తున్నాం.

– ఆముదం వెంకటరమణారెడ్డి, వై.కొత్తపల్లి, యర్రగొండపాలెం

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

● కూటమి ప్రభుత్వంపై పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ ధ్వజం

ఒంగోలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ ధ్వజమెత్తారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు విద్యార్థులు, యువకులకు అనేక హామీలిచ్చిందని తెలిపారు. ప్రస్తుతం వాటిని అమలుచేయడంలో విఫలమైందని విమర్శించారు. చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు జమచేస్తామన్నారని, నేటికీ ఆ హామీ అమలుకాలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,500 కోట్ల ఫీజు బకాయిలుంటే.. నిధులు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో 2.5 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. 50 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 11,000 ఉద్యోగాలకే నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని, వాటిని అలకించే వారే లేరని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్యామ్, నాయకులు వెంకటేష్, ఎలీషా, మానస, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు, విద్యార్థులు

రైతుల పక్షాన పోరాడితే జగనన్నపై కేసులా.?



ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: మిర్చి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే వారి సమస్యను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని, రైతు పక్షపాతి అయిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సోదరులను ఓదార్చేందుకు గుంటూరు మిర్చియార్డుకు వెళ్లి వారి బాధలు తెలుసుకుని పరామర్శిస్తే కేసులు పెడతారా అని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సింగరాయకొండ మండల కేంద్రంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. జగనన్నపై పోలీసులు కేసు నమోదు చేయడంపై ఘాటుగా స్పందించారు. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో జగనన్నతో పాటు మరో 8 మంది పార్టీ నాయకులపై కేసులు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతుకు ఇచ్చిన హామీలైన అన్నదాత సుఖీభవ, గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి వైఫల్యం చెందిందన్నారు. పంటల బీమా పథకాన్ని తుంగలో తొక్కి కనీసం పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వక రైతులు అల్లాడుతుంటే వారికి సమాధానం చెప్పకోలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన జగన్ పోరాటం చేస్తుంటే కేసులు బనాయిస్తూ కూటమి ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

ఉపాధ్యాయులంతా బాలల హక్కులు పరిరక్షించాలి

- ప్రతి పాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ తప్పనిసరి
- ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ఉంచాలి
- బాలల సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి
- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఒంగోలు సిటీ: నేటి బాలలే రేపటి పౌరులని, ప్రపంచానికి ముఖ్యమైన మానవ వనరులుగా వారిని తీర్చిదిద్దేందుకు బాలల హక్కులను పరిరక్షించే బాధ్యతల్లో ఉపాధ్యాయులు ప్రధాన భూమిక పోషించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ, అవి అమలు జరుగుతున్న తీరుపై గురువారం డీఈవో కిరణ్‌కుమార్ అధ్యక్షతన స్థానిక ఎన్టీఆర్ కళాకేంద్రంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన ఈ సమావేశంలో పద్మావతి పాల్గొని మాట్లాడారు. పిల్లలపై మొబైళ్ల ప్రభావం తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. పిల్లలు ఒత్తిడికి గురికాకుండా చదువుతో పాటు క్రీడలు, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మార్కులు, ఇతర విషయాల్లో పిల్లలను ఇతరులతో సరిపోల్చకుండా కేవలం వారి వ్యక్తిగత సామర్థ్యాల మేరకే రాణించే విధంగా తీర్చిదిద్దాలన్నారు. చిన్న వయసులోనే చదువుల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న పిల్లలను చూస్తున్నామన్నారు. చదువంటే కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు కావడం మాత్రమే కాదన్నారు. అనేక రంగాల్లో మంచి అవకాశాలున్నాయని, చిన్న వయసులోనే పిల్లలకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని పాఠశాలల్లో కంప్లైంట్ బాక్సులను కేవలం అలంకారప్రాయంగా కాకుండా పిల్లలందరికీ తెలిసే విధంగా బహిరంగంగా ఉంచాలన్నారు. కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేయడంపై ఉపాధ్యాయులు తప్పుగా భావించరాదని, పిల్లల సమస్యలు వెలుగులోకి వచ్చే విధంగా వాటిని ఉపయోగించాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా ప్రహరీ క్లబ్స్ ఏర్పాటు చేయడమే కాకుండా ఆచరణాత్మకంగా అమలుచేయాలని చెప్పారు. బాలబాలికలిద్దరికీ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని, ఫ్రెండ్లీ టీచర్ కాన్సెప్ట్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. విధిగా ప్రతి నెలా తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని, ఆరోగ్య పరీక్షలు కూడా తప్పనిసరిగా జరిపించాలని ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలని, పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించాలని అన్నారు. పిల్లల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్లు 1098, 100, 112లను ప్రతీ క్లాస్ రూమ్‌లో ఉంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో పౌష్టికాహారం ఉండేలా, స్వచ్ఛమైన తాగునీరు అందేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 10వ తరగతి, ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టికెట్లను నిర్ణీత సమయంలో అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో బాలల సంక్షేమ మండలి సభ్యురాలు నీలిమ వంశీలత, ఐసీడీఎస్ పీడీ హేమసుజన్, బాలల సంరక్షణ విభాగ అధికారి దినేష్‌కుమార్, మండల విద్యాధికారులు, రెసిడెన్షియల్, కస్తూరిబా గాంధీ, బీసీ గురుకుల విద్యాలయాల హెచ్‌ఎంలు, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

క్లుప్తంగా

23న జిల్లా స్థాయి హాకీ జట్టు ఎంపిక

సంతనూతలపాడు: జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్లో ఈ నెల 23న సీనియర్ పురుషుల హాకీ జట్టును ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏవీ రమణారెడ్డి, ఎ.సుందరరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకు రావాలని సూచించారు. 1991 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9666067764ను సంప్రదించాలని సూచించారు.

26న రామాపురంలో ఎడ్ల పోటీలు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలోని సిద్ధిభైరవేశ్వరస్వామి వారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్త మదిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకటనారాయణరెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోగా 500 రూపాయలు ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు అందజేస్తామని వివరించారు. వివరాలకు 94408 91465ను సంప్రదించాలని సూచించారు.

'వెలిగొండ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

ఒంగోలు టౌన్: అసెంబ్లీలో త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్లో వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయడానికి, నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమస్య పరిష్కారానికి 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని సీపీఐ జిల్లా సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక వర్షపాతం నమోదవుతున్నప్పటికీ ప్రకాశం జిల్లా మాత్రం నిత్య కరువుతో అల్లాడుతోందని చెప్పారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ప్రకాశం జిల్లాతోపాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని 36 మండలాలు కరువు నుంచి బయట పడతాయన్నారు. 4.5 లక్షల ఎకరాలకు సాగు నీరు, 20 లక్షల మందికి తాగు నీరు అందుతుందని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న కెనాల్ పనుల పూర్తి కోసం 4 వేల కోట్లు అవసరం అవుతాయని ఇంజినీర్లు చెబుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు 2026 కల్లా ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, అందుకు తగిన చర్యలు తీసుకుని చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వడ్డే హనుమా రెడ్డి, కె.వీరారెడ్డి, శ్రీరాం శ్రీనివాసులు పాల్గొన్నారు.

భర్త పురుగుమందు తాగాడని..

- డయల్ 100కు ఫోన్ చేసిన భార్య
- పరుగులు తీసిన మద్దిపాడు పోలీసులు

మద్దిపాడు: తన భర్త పురుగుమందు తాగాడంటూ ఓ మహిళ డయల్ 100కు ఫోన్ చేయడంతో మద్దిపాడు పోలీసులు పరుగులు తీశారు. వివరాల్లోకి వెళ్తే.. అద్దంకి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన బండి రోశయ్య తాను పురుగుల మందు తాగానని, మద్దిపాడు సమీపంలోని కొస్టాలు సెంటర్లో ఉన్నానని గురువారం భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆమె సాయంత్రం 4 గంటలకు డయల్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో మద్దిపాడు పోలీసులు ముమ్మరంగా గాలించారు. రాత్రి ఏడు గంటల సమయంలో బండి రోశయ్య మేదరమెట్ల బైపాస్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. అక్కడ పురుగుల మందు తాగడానికి ప్రయత్నించినట్లు సమాచారం. కుటుంబ కలహాల కారణంగా భార్యను బెదిరించాలన్న ఉద్దేశంతోనే పురుగుమందు తాగుతున్నట్లు ఫోన్ చేశానని రోశయ్య పోలీసులకు వివరించాడు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

విధులకు డుమ్మా.. వైద్యుల తొలగింపు

ఒంగోలు టౌన్ : శాఖా పరంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, కనీసం సెలవు కూడా పెట్టకుండా విధులకు హాజరు కాకుండా తిరుగుతున్న వైద్యులపై రాష్ట్ర ప్రభుత్వం వేటు వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లోకాయుక్త ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా 55 మందిని తొలగించారు. అందులో జిల్లాకు చెందిన ఆరుగురు వైద్యులు వున్నట్లు తెలిసింది.

తేట తెలుగు భావితరాలకు వెలుగు



ఒంగోలు మెట్రో/మార్కాపురం:

'తిక్కన పద్యమొక్కటి చక్కగ చదివిన చాలు తెలుగుజాతి నుడికారము తెలిసికొన్న యటౌను' తెలుగు నుడికారం గొప్పదనాన్ని వివరిస్తూ దాశరథి పేర్కొన్న మాటలివి. నుడికారమనేది పద్యాలకు, కావ్యాలకు, గ్రంథాలకు, కవులకు, పండితులకే పరిమితం కాదు. నుడికారానికి ముడిసరుకు మనం మాట్లాడే భాషే. నుడికారమనేది పండితులకంటే ముందు పామరుడి సొత్తు. మాటల్లోని చమత్కారం అర్థం కావాలంటే ఆ మాటలు పుట్టిన సమాజంలో పుట్టి పెరగాల్సి ఉంటుంది. భాష ఒకటే అయినప్పటికీ ప్రాంతాన్ని బట్టి, ప్రజల జీవనాన్ని బట్టి నుడికారం మారుతుంది. 2 వేల ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగు భాష గొప్పదనాన్ని గ్రహించి, మాతృ భాషను బతికించుకోవాల్సిన బాధ్యత తెలుగు గడ్డపై పుట్టిన ప్రతి పౌరుడికీ ఉంది. ఏటా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించాలని 1999 నవంబర్ 17న యునెస్కో ప్రకటించింది. ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలన్నిటినీ రక్షించుకోవడం ద్వారానే మనం సాంస్కృతిక, జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో పేర్కొంది. శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా సాహిత్య సేద్యం చేస్తున్న జిల్లా ప్రముఖుల అభిప్రాయాలతో ప్రత్యేక కథనం..

శతకాల రచయిత అన్నపురెడ్డి



వయోజన విద్యాశాఖలో రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా రిటైరైన డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి తెలుగు సాహిత్యంలో అక్షర సేద్యం చేస్తున్నారు. వంద రోజుల్లో తెలుగు నేర్చుకోవడం ఎలా అనే పుస్తకం ఇతర రాష్ట్రాల్లో ప్రాచుర్యం పొందింది. సుమారు 5 లక్షల మంది ఈ పుస్తకాన్ని చదివినట్లు అంచనా. 2001–02లో ఈ పుస్తకం ప్రచురితం కాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. పశ్చిమ ప్రకాశంలో గ్రామ నామాలపై లోతైన పరిశోధన చేసి పుస్తక రూపంలోకి తెస్తున్నారు. ఇది ఆకాశవాణిలో ధారావాహికగా ప్రసారమవుతోంది.అక్షర తపస్వి, మహోపాధ్యాయ బిరుదులు అందుకున్న ఆయన పదుల సంఖ్యలో శతకాలు రచించారు.

మాతృభాషా పరిరక్షణ అందరి బాధ్యత



భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం మన మాతృ భాషలను సంరక్షించుకోగల్గుతామని అందరూ గ్రహించాలి. తల్లి లాంటి మాతృ భాష అభివృద్ధికి అందరూ కృషి చేయాలి. మాతృభాషలో చదువుకున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నా.

– డా.నూనె అంకమ్మరావు, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు

అన్ని తరగతుల్లో తెలుగు బోధించాలి



ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు తెలుగు ఒక సబ్జెక్ట్‌గా ఉండాలి. ,అందులో కనీసం 50 శాతం మార్కులు వస్తేనే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినట్టుగా జీవో ఇవ్వాలి. పిల్లలతో తెలుగు పుస్తకాలు చదివించే అలవాటు చేయాలి. ప్రభుత్వ, కార్పొరేట్ స్కూళ్లలో తెలుగు సాహిత్యంపై పోటీలు నిర్వహించాలి.

– తేళ్ల అరుణ, న.ర.సం గౌరవాధ్యక్షురాలు

భాష.. మనిషికి శ్వాస



మన అస్తిత్వాన్ని తెలిపేది భాష. అలాంటి భాషను ప్రాణంగా భావించి కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రజలతోపాటు ప్రభుత్వాలు సైతం బాధ్యత తీసుకోవాలి. పరభాషలపై మోజును వదిలిపెట్టాలి.

– డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కవి, రచయిత

కవిత్వమంటే శాస్త్రికి ప్రాణం



సాధన డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాగా పనిచేస్తున్న డాక్టర్ కప్పగంతుల మధుసూధన శాస్త్రి తెలుగు సాహిత్యంపై 200కు పైగా చేసిన రచనలు, వ్యాసాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. 130కి పైగా ఆకాశవాణిలో ఉపన్యాసాలు ప్రసారమయ్యాయి. బతుకుబండి పేరుతో స్వీయ కవితా సంపుటి, కరుణశ్రీ సాహిత్యంలో మానవత్వం, ప్రకాశం జిల్లాలో అవధాన కళపై రెండు పరిశోధనా గ్రంథాలను ఆయన రచించారు. ప్రకాశం జిల్లాలో అవధాన కళపై డాక్టరేట్ పొందారు.

తెలుగు భాష ఘనమైనది





చిన్నప్పటి నుంచే పిల్లలకి తెలుగు పద్యాలు నేర్పడం వల్ల వారిలో భాషాభిమానం ఏర్పడుతుంది. సుమతి శతకం, వేమన శతకము మొదలైనవి తేలికగా అర్థమవుతాయి. మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకం వల్ల సామాజిక జ్ఞానం ఏర్పడుతుంది. కృష్ణవేణి చరితం, గుండ్లకమ్మ చరితం, శంకర విజయం మొదలైన నృత్య రూపకాలు రచించి తెలుగు భాష రుణం కొంత తీర్చుకున్నానని భావిస్తున్నా.

– నెమ్మాని సీతారామమూర్తి, గిడుగు సాహితీ పురస్కార గ్రహీత

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం

- ముగ్గురు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ల పాత్ర!
- రూ.2.80 లక్షల నగదు, రూ.48 వేలు ఫోన్ పే నగదు దోచుకున్నట్లు ఆరోపణ
- బేస్తవారిపేట మండలంలోని పందిళ్లపల్లె టోల్ ప్లాజా వద్ద సంఘటన
- పోలీసులను ఆశ్రయించి గోడు వెళ్లబోసుకున్న బాధితులు


రైస్ పుల్లింగ్ అంటూ చూపించిన పరికరం


బాధితులు ఫోన్‌పే చేసిన నంబర్


బీట్ ఆఫీసర్ బంధువు ఫోన్ పే నంబర్

బేస్తవారిపేట: రైస్ పుల్లింగ్ పేరుతో మోసానికి పాల్పడిన వ్యవహారం గురువారం వెలుగులోకి రాగా అందులో ముగ్గురు అటవీశాఖ సిబ్బంది పాత్ర ఉన్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం మేరకు.. మార్కాపురం మండలం వేములకోటకు చెందిన డి.సాయికుమార్‌కు స్నేహితుడు కిషోర్, అంబులెన్స్ డ్రైవర్ రాజేష్ బేస్తవారిపేటలోని ఓ వ్యక్తి వద్ద రైస్ పుల్లింగ్ యంత్రం(బియ్యాన్ని ఆకర్షించే శఠగోపం లాంటి వస్తువు) ఉందని చెప్పారు. ఈ విషయమై బేస్తవారిపేటకు చెందిన రామకృష్ణ అనే వ్యక్తిని కుంట వద్దకు పిలిపించి సెల్‌ఫోన్‌లో రైస్ పుల్లింగ్‌ను చూపించాడు. రూ.3 లక్షల నగదు తీసుకొస్తే కొనుగోలు చేయవచ్చని కిషోర్, అతని స్నేహితులు చెప్పారు. దీంతో సాయికుమార్ తన స్నేహితుడైన తర్లుపాడుకు చెందిన కారు డ్రైవర్ మల్లికార్జున్‌ను నగదు అడిగాడు. వేరే వాళ్ల వద్ద బంగారం ఉంది, నీకు రూ.3 లక్షలకు అదనంగా రెండు లక్షల వరకు ఇస్తానని చెప్పాడు. రైస్ పుల్లింగ్ విషయాన్ని సాయికుమార్ తన బంధువైన కనిగిరికి చెందిన రామకృష్ణకు చెప్పాడు. కోట్ల ధరకు అమ్మవచ్చని హైదరాబాద్ నుంచి ఇద్దరు వ్యక్తులను పిలిపించాడు.

రూ.2.80 లక్షల నగదు కారులో పెట్టుకుని సాయికుమార్, మల్లికార్జున్, కిషోర్, కనిగిరికి చెందిన రామకృష్ణ, హైదరాబాద్ వ్యక్తులు బేస్తవారిపేటలోని పందిళ్లపల్లె టోల్ ప్లాజా వద్దకు వచ్చారు. జగనన్న లేఔట్ రోడ్డు చివరికి వెళ్లిన తర్వాత రైస్ పుల్లింగ్ ఉందని చెప్పిన బేస్తవారిపేటకు చెందిన రామకృష్ణ అక్కడికి రాలేదు. కానీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఇద్దరు గరికపాటి శ్రీనివాసులు, జక్కం శ్రీనివాసులు, గరికపాటి శ్రీనివాసులు కుమారుడు రవి, డ్రైవర్ లేఔట్ వద్దకు వచ్చారు. కారులో వెతుకులాడి రూ.2.80 లక్షల నగదు తీసుకున్నారు. కనిగిరి, హైదరాబాద్ నుంచి వచ్చిన వ్యక్తులను బెదిరించి మల్లికార్జున్ సెల్‌ఫోన్‌కు రూ.48 వేలు ఫోన్ పే చేయించారు. మరళా రూ.48 వేలను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ చెప్పిన నంబర్‌కు ఫోన్ పే చేయించుకున్నారు. అక్కడికి వచ్చిన వారిని బెదిరించి వీడియోలు తీసుకుని, ఎవరికైనా చెబితే కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తామని హెచ్చరించారు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు కంభం సీఐ కే మల్లికార్జున్, బేస్తవారిపేట ఎస్సై ఎస్‌పీ రవీంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఇదేంది సారూ.. రోజూ పప్పుచారు!


రోజూ మాదిరిగానే అన్నం, పప్పు తింటున్న బాలికలు


తాగడానికి, చేతులు శుభ్రం చేసుకోవడానికి ఈ నీరే దిక్కు

- ఏపీ మోడల్ పాఠశాల వసతి గృహంలో మెనూకు మంగళం
- కొన్ని నెలలుగా అన్నం, పప్పు చారే విద్యార్థినులకు దిక్కు
- పాలు, గుడ్లు, కూరగాయలకు నోచుకోని చిన్నారులు
- పదేళ్లు విలేకరిగా చేశానంటూ ప్రిన్సిపాల్ దబాయింపు

పెద్దదోర్నాల: విద్యార్థుల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నట్టు చెబుతున్న నగదు ఎటు పోతోందో తెలియదు కానీ ఆ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినుల కష్టాలు మాత్రం గట్టెక్కడం లేదు. పాఠశాలలో హాస్టల్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై అధికారుల పర్యవేక్షణ, విద్యార్థినుల సంక్షేమంపై అధ్యాపకులు అనుసరిస్తున్న వైఖరి విమర్శలకు కేంద్ర బిందువయ్యాయి. కాగితాలకే పరిమితమైన ఆహార పట్టికతో పాటు, తాగేందుకు పరిశుభ్రమైన నీరు సైతం దొరకని పరిస్థితులు అక్కడ ప్రత్యక్షంగా కనిపిస్తాయి. ఇలా ఎన్నో సమస్యలు ఆ మోడల్ పాఠశాలను పట్టి పీడిస్తున్నాయంటే సమస్యలను ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పిల్లలకు సరైన భోజనం పెట్టటం లేదంటూ కొందరు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో పాఠశాలను 'సాక్షి' విజిట్ చేయగా వసతి గృహంలోని డొల్లతనం బట్టబయలైంది. పెద్దదోర్నాల మండల పరిధిలోని మొల్ల మల్లికార్జునాపురంలోని ఏపీ మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ వసతి గృహ విద్యార్థినులు భోజనంతో పాటు వసతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలపై ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే 'నేను పదేళ్ల పాటు పలు పత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశా. ఎవరికి చెప్పినా ఏమీ చేయలేర'న్న ధోరణితో వ్యవహరించడం గమనార్హం. మోడల్ పాఠశాలలో సుమారు 529 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల ప్రాంగణంలోనే ఉన్న బాలికల హాస్టల్‌లో 100 మంది వరకు ఉంటున్నారని సిబ్బంది చెపుతున్నారు. అయితే హాస్టల్ బాలికలు గత కొంత కాలంగా అన్నం, పప్పు చారుతోనే సరిపెట్టుకోవాల్సి వస్తుంది. బాలికలు ట్యాంకు నీటినే తాగుతున్నారు. దీనిపై పార్ట్‌టైం వార్డెన్‌ను ప్రశ్నించగా.. తనకు ఏమీ తెలియదని, ప్రిన్సిపాల్ ఏది చెబితే అదే వండుతున్నానని, మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయటం లేదని ఆమె సమాధానమిచ్చారు. ఇదిలా ఉండగా ఏ రోజు ఏమి వండాలో కూడా తెలియని పరిస్థితి వంట మనుషుది. వసతి గృహంలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ వివరాలే లేకపోవడం గమనార్హం. మెనూ ఏమిటో చెప్పాలని ప్రిన్సిపాల్‌ను కోరగా నీళ్లు నమలడం ఆయన వంతైంది. ఇతర పాఠశాలల ప్రిన్సిపాళ్లకు ఫోన్ చేసి మెనూ వివరాలు వాట్సాప్‌లో తెప్పించుకున్నారంటే ఇక్కడ ఏం జరుగుతోందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విద్యార్థినుల సంఖ్య 100 అని ప్రిన్సిపాల్ చెబుతుండగా అంత మంది లేరని మిగిలిన సిబ్బంది పేర్కొంటున్నారు. ఒక్కో విద్యార్థినికి ప్రభుత్వం నెలకు రూ.1600 ఖర్చు చేస్తోంది. ఆ మేరకు కూరగాయలు, ఆకుకూరలు వండకుండా కేవలం అన్నం, నీళ్ల చారు మాత్రమే పెడుతుండటం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తేటతెల్లం చేస్తోంది. మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బందిపై చర్యలు తీసుకుని, మెనూ పాటించేలా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

బైకును ఢీకొట్టిన కారు

- ప్రమాదంలో ఒకరు మృతి
- అదుపుతప్పి బోల్తా పడిన కారు


బోల్తా కొట్టిన కారు


సంఘటనా స్థలంలో వేముల నివాస్

పామూరు: జాతీయ రహదారిపై బైక్ మీద వెళ్తూ ఓ చోట మలుపు తిరుగుతున్న వ్యక్తిని తప్పించబోయి ఎదురుగా వస్తున్న కారు బోల్తా కొట్టింది. ఈ క్రమంలో బైక్‌ను కారు బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలతో మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన పామూరు మండలంలోని నుచ్చుపొద సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన బేల్దారీ కూలీ వేముల నివాస్(44) పామూరులో సొంత పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. నుచ్చుపొద సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్‌బంక్‌వైపు బైక్‌ను తిప్పాడు. అదే సమయంలో కందుకూరు నుంచి పామూరు వస్తున్న కారు నివాస్ బైక్‌ను తప్పించబోయి బలంగా ఢీకొట్టింది. నివాస్ తలకు గాయాలై రోడ్డుపై పడగా స్థానికులు ఓ ఆటోలో పామూరులోని కమ్యూనిటీ వైద్యశాలకు తరలించారు. అప్పటికే నివాస్ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. కాగా, కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. అందులోని వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఘటనా స్థలాన్ని సీఐ ఎం.భీమానాయక్ పరిశీలించారు. మృతునికి భార్య సుజాత, ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పి.దాసు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలించారు. భర్త మృతితో భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. కాగా మృతుడు హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలతో బయటపడి ఉండేవాడని స్థానికులు చర్చించుకున్నారు.


రోదిస్తున్న భార్య, బంధువులు

గురుకులంలో దారుణం

- వంటశాలలో విద్యార్థులతో పనులు
- విద్యార్థి మధుమోహన్‌పై వేడివేడి పాలు పడి తీవ్రగాయాలు
- మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్‌కు తరలింపు
- ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌పై విద్యార్థి తల్లిదండ్రుల ఆగ్రహం


వేడి పాలు పడి గాయపడిన బాలుడు

టంగుటూరు: స్థానిక వెంకటాయపాలెం సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల బాలుర పాఠశాలలో గురువారం దారుణం చోటుచేసుకుంది. విద్యార్థులచే వంటశాలలో వెట్టి చాకిరీ చేయిస్తుండటంతో వేడివేడి పాలు ఐదో తరగతి విద్యార్థి మాచేపల్లి మధుమోహన్‌పై పడి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనతో విద్యార్థులచే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ వెట్టిచాకిరీ చేయిస్తున్న బాగోతం బయటపడింది. మద్దిపూడి మండలం కూచిపూడి గ్రామానికి చెందిన మాచేపల్లి మధుమోహన్ (11) గురుకుల బాలుర పాఠశాలలో చదువుతున్నాడు. పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్లు వంటశాలలో విద్యార్థులతోనే కొన్నాళ్లుగా పనులు చేయిస్తున్నారు. గురువారం ఐదో తరగతి విద్యార్థి మాచేపల్లి మధుమోహన్ వంటశాలలో పనులు చేసి విద్యార్థులకు పాలిచ్చే సమయంలో వేడివేడి పాలు అతనిపై పడ్డాయి. వంటశాల నుంచి పాలను బయటకు తీసుకొచ్చే క్రమంలో బరువు మోయలేక పాత్ర కిందపడి వేడి పాలు మధుమోహన్‌పై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. శరీరం అంతా కాలిపోయింది. పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్లు గుట్టుచప్పుడు కాకుండా టంగుటూరులోని ఆరాధ్య ప్రైవేటు ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తగిలించారు. దీంతో ఈ ఘటన బహిర్గతమైంది. జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలకు వస్తారనే భయంతో ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్లు పాలు పడిన ప్రాంతాన్ని క్లీన్ చేశారు. విద్యార్థికి గాయాలైన విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుసుకుని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌పై మండిపడ్డారు. విద్యార్థులతో పనులు చేయిస్తే ఊరుకోమని తేల్చి చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు రక్షణ లేకపోతే ఎలాగంటూ నిలదీశారు. ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, గాయాలపాలైన విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్‌కు తరలించారు. విద్యార్థిని మంత్రి డీబీవీ స్వామి గురువారం పరామర్శించారు. సిబ్బంది నిర్లక్ష్యం ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నిర్లక్ష్యమే కారణం

ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇటువంటి ఘటన జరిగిందని బక్క తిరుమలరావు మాదిగ అన్నారు. వేడి పాలు మీద పడి గాయాలైన బాలుడికి నాణ్యమైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులతో పనులు చేయించిన సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు.


టంగుటూరు వైద్యశాలలో బాలుడి వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

పశ్చిమాన జోరుగా గంజాయి విక్రయం!

గిద్దలూరు(బేస్తవారిపేట): పశ్చిమ ప్రకాశంలో గంజాయి వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. మార్కాపురం, కంభం, గిద్దలూరులో గంజాయి సరఫరా చేసే వ్యక్తులు, అమ్మకందారులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. నిఘా వైఫల్యం కారణంగానే గంజాయి విక్రయాలు గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్నట్లు తెలుస్తోంది. గత నెలలో గిద్దలూరులోని కొంగలవీడు రోడ్డులో గంజాయి విక్రేతలు నలుగురిని పోలీసులు అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. గిద్దలూరులోని పూసలబజార్ సమీపంలోని ఎస్టీ కాలనీలో ఈ ముఠా ఉన్నట్లు స్థానికుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. విశాఖపట్నం నుంచి గిద్దలూరుకు గంజాయి ప్యాకెట్లు వస్తున్నాయని సమాచారం. రెండు రోజుల క్రితం పెద్ద ఎత్తున గంజాయి ప్యాకెట్లతోపాటు ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొందరు గిద్దలూరు పరిసర ప్రాంతాల్లో ఉంటూ గంజాయి దందా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తే గంజాయి రాకెట్ వచ్చే అవకాశం ఉంది. పోలీసులు గంజాయి సరఫరా, అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకోకపోతే పల్లెలకు విస్తరించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

